సాక్షి ప్రకాశం

ఆదివారం । 15 । జూన్ । 2025

I



హైలెస్సో..హైలెస్సా

61 రోజుల వేట నిషేధం అనంతరం నేటి నుంచి సముద్రంలో మత్స్యకారుల వేట ప్రారంభం కానుంది. మత్స్యకారులు వలలు, బోట్లు సిద్ధం చేసుకుంటున్నారు. - IIలో..



క్రీడా వికాస కేంద్రం పేరుతో దోపిడీ

యర్రగొండపాలెంలో క్రీడా వికాస కేంద్రం పేరుతో డబ్బులు దండుకుంటున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

రెండెకరాలకు పది ఎకరాలుందని చూపి..



రెండు ఎకరాలున్న ఓ రైతుకు ఆన్‌లైన్‌లో పది ఎకరాలు ఉందని తప్పుగా చూపి వారి పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టారు. కొండపి మండలం కే ఉప్పలపాడు గ్రామానికి చెందిన కొల్లి వీరనారాయణమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు కుమార్తె గీతికరెడ్డి, కుమారుడు వెంకట దీపక్ రామిరెడ్డి ఉన్నారు. గీతిక రెడ్డి స్థానిక జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి, వెంకట దీపక్ రామిరెడ్డి పాపారావు హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. సామాన్య మధ్యతరగతి కుటుంబం కావడంతో కుటుంబ పోషణ అంతంత మాత్రమే ఉండడంతో కూలీ నాలి చేసుకుంటూ పిల్లల్ని చదివిస్తున్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం ద్వారా కుమార్తె గీతికా రెడ్డికి అమ్మ ఒడి నిధులు జమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక మెట్ట భూమి 10 ఎకరాలు అంతకంటే ఎక్కువ ఉందంటూ అనర్హుల జాబితాలో చేర్చారు. అయితే వారికి తల్లిదండ్రులు ఇచ్చిన రెండు ఎకరాల పొలం తప్పితే ఎటువంటి భూమి లేదు. ఆన్‌లైన్‌లో తప్పుగా వచ్చిందని..అర్హులైన తమకు పథకం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఇంటి పేరు తప్పు పడినందుకు..



తల్లి ఇంటి పేరు తప్పుపడినందుకు ఏలూరివారిపాలెం గ్రామంలో ఒకే ఇంటిలో ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం అనర్హత వేటు పడింది. చీమకుర్తికి చెందిన పేరుబోయిన శ్యామ్ ప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో తన్విక అదే గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి, జాస్మిన్ గొట్లగట్టులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువున్నారు. అయితే శ్యామ్ ప్రసాద్ భార్య భారతికి ఇంటి పేరు ఆమె తల్లిదండ్రుల రేషన్ కార్డులో వడ్లమాను భారతిగా నమోదైంది. ఇటీవల రేషన్ కార్డులో నుంచి భారతి పేరును శ్యామ్ ప్రసాద్ రేషన్ కార్డులోకి మార్చుకోవడానికి చర్యలు తీసుకున్నారు. కానీ ఇంకా రేషన్ కార్డులో పేరు మారకపోవడంతో ప్రభుత్వం రెండు రోజుల క్రితం విడుదల చేసిన తల్లికి వందనం లిస్టులో శ్యామ్ ప్రసాద్‌కు చెందిన ఇద్దరు పిల్లల పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

నీకు రూ.15 వేలు..నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు... ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు గొప్పగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది ఎగనామం పెట్టారు. రెండో ఏడాది ప్రకటించిన జాబితాలో జిల్లాలో సుమారు లక్షా పది వేల మందిని ఈ పథకానికి దూరం చేసింది. రకరకాల నిబంధనలు అమలు చేస్తూ వారికి డబ్బులు వేయకుండా ఎగ్గొట్టింది. మొదటి సంవత్సరం ఇవ్వకపోవడంతో తాజాగా ప్రకటించిన జాబితా ప్రకారం రూ.215.23 కోట్ల మేర జిల్లా విద్యార్థులు నష్టపోయారు.



> **అమ్మ ఒడి వచ్చింది.. తల్లికి వందనం ఆగింది**
>
> 
>
> నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు పూజిత ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పూర్తి కాగా, చిన్న కూతురు భానుశ్రీకు ఒకటో తరగతి పూర్తయింది. వీరిద్దరికీ తల్లికి వందనం డబ్బులు నా బ్యాంక్ అకౌంట్‌లో జమ కాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లో మా అమ్మాయికి అమ్మ ఒడి పథకం కింద నగదు బ్యాంకు ఖాతాలో జమైంది. ఈసారి ఎందుకు జమ కాలేదో అర్థం కావటం లేదు.
>
> - పల్లకి అంజలి, మర్రిపూడి

కొందరికే వంధనం

- తల్లికి వందనానికి కొర్రీలు
- జిల్లాలో లక్ష మందికి మొండిచెయ్యి
- మొత్తం 3,74,939 మంది విద్యార్థులు
- 2,65,559 మందికే లబ్ధి
- 1,09,380 మందికి ఎగనామం
- డ్రాపౌట్స్ పేరుతో 35 వేల మందికి మంగళం
- సచివాలయాల్లో జాబితాలు చూసి అవాక్కు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ఒంగోలు సిటీ: ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో తల్లికి వందనం పథకాన్ని ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చాక ఈ పథకం అమలు విషయంలో తాత్సారం చేస్తూ వచ్చింది. వీలైనంత మంది విద్యార్థుల సంఖ్యకు కోత పెట్టేందుకు రకరకాల నిబంధనలు తెచ్చింది. అంతేకాదు రూ.15 వేలు జమచేస్తామంటూ చెప్పి రూ.13 వేలు మాత్రమే వారి అకౌంట్లల్లో జమచేస్తామని చెప్పడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర నిరాశ చెందారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడనున్నాయి.

జిల్లాలో 1.9 లక్షల మందికి కోత..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2,991 ఉన్నాయి. వీటిల్లో 3,32,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే ఇంటర్మీడియెట్ విద్యార్థులు 42,439 మంది ఉన్నారు. మొత్తంగా సుమారు 3,74,939 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. అయితే ప్రభుత్వం పలు రకాల నిబంధనలు అమలు చేసి 2,65,559 మంది విద్యార్థులను మాత్రమే అర్హులుగా చేర్చింది. 1,68,603 మంది తల్లుల ఖాతాలో రూ.215.23 కోట్లు (రూ.13 వేలు చొప్పున) జమ కానుందని ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం తెలుస్తోంది. మిగతా వారికి సుమారు 1,09,380 మంది విద్యార్థులను అనర్హులుగా చేర్చింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి అమలు ఇలా..

విద్యా సంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,16,028	324,04,20,000
2020-21	1,97,329	295,99,35,000
2021-22	2,09,776	314,66,40,000
2022-23	2,82,088	423,13,20,000

దీంతో అనర్హులుగా ఉన్న సామాన్య, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సచివాలయాల్లో జాబితాలు చూసి..

జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల్లో తల్లికి వందనం జాబితాలను ప్రదర్శనకు ఉంచారు. 597 గ్రామ, 122 వార్డు సచివాలయాల్లో ఉంచిన జాబితాలను చూసి చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. పలు నిబంధనలు పేరుతో అనర్హుల జాబితాల్లో తమ పేర్లు ఉండడంతో వారు నిర్ఘాంత పోతున్నారు. ప్రభుత్వ లెక్క ప్రకారం చూస్తే ఇటీవల టెన్త్ పరీక్షలు రాసి ఇంటర్లో చేరిన విద్యార్థులకు మాత్రమే లబ్ధి చేకూరనుంది. పాలిటెక్నిక్, ఐటీఐ చదివిన వారు, కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిన వారిని అనర్హులుగా ప్రకటించారు. అలాగే తల్లి ఇంటి పేరు మారినా, ఇంట్లో ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉన్నా.. పది ఎకరాలకు మించి పొలాలు ఉన్నా.. కొందరికి అసలు పొలాలు లేకపోయినా పొలాలు ఉన్నట్టు చూపించి అనర్హులుగా చేర్చారు. 75 కంటే తక్కువ హాజరు శాతం ఉన్నా ఈ పథకాన్ని వర్తింపజేయలేదని తెలిసింది.

డ్రాపౌట్స్ పేరుతో 35 వేల మందికి మంగళం

ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సుమారు రూ.45,807 మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరు కావడం లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు తేల్చారు. అందులో 12,202 మంది తిరిగి పాఠశాలకు వచ్చినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీంతో 33,605 మంది విద్యార్థులు పాఠశాలలకు రావడలేదని చెబుతూ వారిని ఈ పథకానికి అనర్హులుగా తేల్చారు.

> **నమ్మించి మోసగించారు**
>
> 
>
> నాకు ఇద్దరు పిల్లలు. కుందురు హారిక రెడ్డి 8వ తరగతి, కుందురు చందనాథరెడ్డి 7వ తరగతి చదువుతున్నాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ, చిన్నపాటి బడ్డీ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గతంలో అమ్మ ఒడి వచ్చింది. కానీ ఈసారి కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని చెప్పి తల్లికి వందనం ఆపేశారు. పిల్లలు బాగా చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ఇస్తామని చెప్పి మా ఆశలపై నీళ్లు చల్లారు. నమ్మించి మోసగించారు. అప్పులు చేసి చదివించలేము, అమ్మటానికి ఆస్తులు లేవు. ప్రభుత్వం ఎలాగైనా సహకరించాలి.
>
> - కుందురు నాగదుర్గ, కురిచేడు

> **బాబును నమ్మితే భవిష్యత్తు గాలికే**
>
> 
>
> చంద్రబాబు మాటలు నమ్మితే పిల్లల భవిష్యత్తు గాలిలో కలిసిపోయినట్లే. మాది చిన్న రైతు కుటుంబం. ఒక కుమారుడు ఉన్నాడు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్నాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం వచ్చింది. కానీ గత ఏడాది ఇస్తానని ఇవ్వకుండా మోసం చేశారు. ఇప్పుడు కూడా తల్లికి వందనం డబ్బులు పడలేదు. అయినా మా బాబును కూలినాలి చేసి చదివించుకుంటాం. చంద్రబాబును నమ్మి మా అబ్బాయి జీవితం పాడుచేసుకోలేం.
>
> - ఎగ్గోని లక్ష్మి, చందవరం, దొనకొండ మండలం



కోర్టు వద్ద చెవిరెడ్డి, అన్నా, కేపీ, ఉడుముల, రమణారెడ్డి

కార్యకర్తల వెన్నంటే ఉంటాం



వైద్యశాల వద్ద వెంకాయమ్మ, అన్నా రాంబాబు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
- అక్రమ కేసుల్లో అరెస్టయిన కార్యకర్తలకు పరామర్శ

పొదిలి: కూటమి నేతలు అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు వెన్నంటి అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌లో, వైద్యశాలలో, కోర్టు వద్ద అరెస్ట్ అయిన కార్యకర్తలను వారు పరామర్శించారు. అరెస్ట్ చేసిన ప్రతి కార్యకర్త వివరాలను, కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీశారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు, భార్యా పిల్లలు ధైర్యంగా ఉండాలని చెప్పారు. అరెస్ట్ అయిన కార్యకర్తలకు సంబంధించి గ్రామాల్లో మిగిలిన నాయకులు, కార్యకర్తలు వారి కుటుంబాలకు అండగా ఉండి, ధైర్యం చెప్పాలన్నారు. లీగల్ టీమ్ సభ్యులతో తాము అన్ని విషయాలు ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, వారి కేసులు తేలేంత వరకు లీగల్ టీం పనిచేస్తుందని చెప్పారు. కార్యకర్తల కుటుంబాలకు కూడా తాము అండగా ఉంటామని చెప్పారు. కార్యకర్తలకు లీగల్ టీం ద్వారా న్యాయ సహాయం అందేలా చేస్తామన్నారు. అరెస్ట్ అయిన కొందరి వివరాలు తీసుకుని వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఎటువంటి సమస్య వచ్చినా తాము నిత్యం అందుబాటులో ఉంటామని వారు చెప్పారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ అక్రమంగా కేసులు నమోదు చేయటం ద్వారా, జగన్‌మోహన్‌రెడ్డి పోరుబాట కార్యక్రమం సూపర్ సక్సెస్ కావటంతో ఓర్చుకోలేక పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు. చివరికి న్యాయం గెలుస్తుందని అన్నారు. తాము ఎప్పటికప్పుడు చర్చించుకుని ఐక్యంగా కార్యకర్తల కోసం పనిచేస్తామని చెప్పారు. కార్యకర్తలను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ.రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, తర్లుపాడు అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్. మస్తాన్‌వలి, శ్రీధర్‌రెడ్డి, శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

పంచాయతీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ప్రభుత్వానికి సర్పంచుల సంఘం డిమాండ్

ఒంగోలు సబర్బన్: కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలన అనంతరం అయినా పంచాయతీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే పంచాయతీలకు రాజ్యాంగబద్ధమైన పూర్తి అధికారాలు ఇస్తామని, గౌరవ వేతనం పెంచుతామని ఇచ్చిన హామీని నేటి వరకూ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకొని పంచాయతీరాజ్ స్థానిక సంస్థల పదవీకాలం పూర్తి కావస్తున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సర్పంచ్‌లకు గత ఏడాదిగా గౌరవ వేతనం విడుదల చేయలేదని అన్నారు. మరో తొమ్మిది నెలల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తున్నందున గౌరవ వేతనం విషయం పరిష్కరించాలని పవన్ కళ్యాణ్‌ను కోరారు. గౌరవ వేతనం పెంచాలని, పెంచిన గౌరవవేతనం ఈ జనవరి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15 వ ఆర్థిక సంఘం మిగులు నిధులు, పల్లె పండుగ పనుల నిధులు తక్షణమే విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీల విషయంలో నిర్లక్ష్యం తగదని అన్నారు.

నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంక్ సాధించిన లాస్యప్రియ



లాస్యప్రియ

ఒంగోలు టౌన్: నేషనల్ ఎలిజిబులిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీలో ఒంగోలుకు చెందిన లాస్య ప్రియ ప్రతిభ చాటింది. మొత్తం 558 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 9031 ర్యాంక్ సాధించింది. లాస్య తండ్రి ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రామ్‌నగర్ మున్సిపల్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయుడిగా చేస్తున్నారు. తల్లి ఉషారాణి కొత్తపట్నం జెడ్పీహెచ్ స్కూలులో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. లాస్య ప్రియ నీట్‌లో ర్యాంక్ సాధించడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో భయం..భయం

- పొదిలి ఘటనపై అర్ధరాత్రులు గ్రామాల్లో పోలీసుల హల్‌చల్
- వైఎస్సార్ సీపీ నేతల అక్రమ అరెస్టులు
- నిద్రపోతున్న వారిని లేపి దుస్తులు కూడా మార్చుకోనీయకుండా పోలీసుస్టేషన్‌కు తరలింపు
- పొగాకు రైతులకు మద్దతుగా పోరుబాట ర్యాలీలో పాల్గొనడమే నేరం
- కూటమి పాలనలో అరాచకం రాజ్యమేలుతోందంటూ దుమ్మెత్తి పోస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగిన జగనన్న పోరుబాట ర్యాలీ అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేసినట్లుంది. వేలాది మంది ప్రజలు తరలిరావడం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి నడవడం జీర్ణించుకోలేకపోతోంది. అసహనంతో రగలిపోతున్న కూటమి పాలకులు తమ కడుపుమంట చల్లార్చుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల మీద పడ్డారు. పోలీసులను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయించి వేధింపులకు దిగారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా గ్రామాల్లో భయోత్పాతం సృష్టిస్తున్నారు. ఇంట్లో నిద్రపోతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను నిద్ర లేపి మరీ దుస్తులు మార్చుకునే సమయం కూడా ఇవ్వకుండా ఉన్నపలంగా పోలీసు స్టేషన్‌కు తరలించారు. పార్టీ సామాన్య కార్యకర్తలను తీవ్రవాదుల్లాగా, కరుడు గట్టిన నేరస్తుల్లాగా అరెస్టులు చేస్తుండటంతో గ్రామీణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

అక్రమ అరెస్టులతో భయోత్పాతం...

అన్ని అనుమతులతోనే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదిలిలో పర్యటించారు. కానీ, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా వ్యవహరించారు. అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కయ్యారు. టీడీపీ నిరసనలకు పోలీసులు అనధికారికంగా అనుమతులివ్వడమే అసలు సమస్యకు ఆజ్యం పోసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు పచ్చమూకలు కిరాయి ముఠా సభ్యులతో కలిసి జగన్ కాన్వాయ్ మీదకు రాళ్లు, చెప్పులు రువ్వారు. ఈ దాడిలో పలువురు రైతులు, ఒక పోలీసు కానిస్టేబుల్, పార్టీ కార్యకర్తలు గాయపడ్డారు. టీడీపీ కార్యకర్తలు రాళ్లురువ్వితే వారిపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు.. అందుకు విరుద్ధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీదనే ఎదురు కేసులు నమోదు చేసి అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామంలో అర్ధరాత్రి 3 గంటలకు ప్రవేశించిన పోలీసులు హల్చల్ చేసినట్లు సమాచారం. ఇంట్లో గాఢనిద్రలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్త గుర్రం బాలకృష్ణ ఇంటికి వెళ్లి నిద్రలో ఉన్న అతడిని లేపి దుస్తులు కూడా మార్చుకోనీయకుండా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ముండ్లమూరు మండలం కొమ్మవరం గ్రామానికి చెందిన మేకల కృష్ణారెడ్డి చీమకుర్తి మండలం నాయుడుపాలెంలోని అత్తగారింట్లో నిద్రిస్తుండగా తీసుకెళ్లారు. దర్శి మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు మోహన్‌ను, చీమకుర్తి పట్టణానికి చెందిన మన్నం శ్రీధర్‌బాబును అర్ధరాత్రి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లి అరెస్టు చేశారు. మొత్తం 16 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. అక్రమంగా అరెస్టు చేశారు. వీరిలో ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. మిగతా 9 మందిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు. తీవ్రవాదులను అరెస్టు చేసినట్టుగా పోలీసులు వ్యవహరిస్తుండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరిగ్గా దుస్తులు వేసుకునే అవకాశం కూడా వారికి ఇవ్వలేదు. చివరికి షార్ట్ మీద ఉన్న వారిని అలాగే పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లడమేమిటని ప్రజలు మండిపడుతున్నారు.

శాంతి భద్రతలను కాపాడలేదంటూ నోటీసులు...

పోరుబాట ర్యాలీ సందర్భంగా శాంతి భద్రతలను కాపాడలేకపోయారంటూ దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పోలీసులు నోటీసులివ్వడం చర్చనీయాంశంగా మారింది. నిజానికి శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసుల మీద ఉంది. కానీ, పోరుబాట సందర్భంగా శాంతి భద్రతలను కాపాడలేకపోయారంటూ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పోలీసులు నోటీసు ఇచ్చారు. ఇదిలా ఉండగా, నేను ఒక ఎమ్మెల్యేనే గానీ పోలీసును కాదని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చెంపపెట్టులాంటి సమాధానం చెప్పారు.

క్లుప్తంగా

బ్యాంకు లోను కట్టడానికి రూ.4 లక్షలతో వెళ్లి..

- అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



పొలాల్లో సుబ్బారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



సుబ్బారెడ్డి (ఫైల్)

ముండ్లమూరు (కురిచేడు): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ముండ్లమూరు మండలం లోని వేముల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మిత సుబ్బారెడ్డి (37) బ్యాంకు లోనుకు డబ్బుకట్టి బంగారం తెచ్చేందుకు వెళ్లి పంటపొలాల్లోని వేపచెట్టు వద్ద మృతి చెంది పడి ఉన్నాడు. శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బారెడ్డి గత గురువారం ఉల్లగల్లులోని కెనరా బ్యాంకులో బంగారం లోను డబ్బులు కట్టి బంగారం తేవాలని ఇంటి నుంచి నాలుగు లక్షల రూపాయల నగదుతో తన ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లాడు. శనివారం ఉల్లగల్లు పొలాల్లో వేపచెట్టు కింద అతని మృతదేహం లభ్యం కావడం, మృతదేహం పురుగులు పట్టి దుర్వాసన వెదజల్లుతుండటంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. సుబ్బారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఎవరైనా చంపి అక్కడ పడేసి డబ్బుతో పరారయ్యారా.? లేక ఇంకేమైనా మిస్టరీ ఉందా? అనే విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. విషయం తెలుసుకున్న మృతుడి భార్య, కుమార్తె, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు, పెద్ద సంఖ్యలో వేముల గ్రామ ప్రజలు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

హైలెస్సో.. హైలెస్సా

- నేటి నుంచి సముద్రంలో చేపల వేట ప్రారంభం
- ఇప్పటికే వలలు, బోట్లు సిద్ధం చేసుకున్న మత్స్యకారులు
- 61 రోజులుగా వేట నిషేధంతో బోసిపోయిన సముద్రతీరం
- మళ్లీ సందడిగా మారనున్న తీరప్రాంతం
- గతేడాది వేట నిషేధ భృతికి ఎగనామం పెట్టిన కూటమి సర్కార్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 5,452 మందికి వేట నిషేధ భృతి అందజేత
- ఈ ఏడాది నిబంధనల పేరిట లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించిన చంద్రబాబు ప్రభుత్వం
- 7,285 మంది లబ్ధిదారులు ఉంటే.. కేవలం 5,501 మందికి మాత్రమే భృతి



కొత్తపట్నంలో వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

ఒంగోలు సబర్బన్:

సముద్రంలో చేపల వేటకు వేళయింది. ప్రభుత్వం విధించిన చేపల వేట నిషేధం శనివారంతో ముగిసింది. దాంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే బోట్లు, వలలు, ఇతర సామగ్రి సిద్ధం చేసుకున్నారు. 61 రోజులుగా చేపల వేట నిషేధంతో బోసిపోయిన సముద్ర తీరం నేటి నుంచి మళ్లీ సందడిగా మారనుంది. గతేడాది మత్స్యకారులకు సముద్రంలో చేపల వేట కలిసిరాలేదు. 2024 జూన్‌లో వేట మొదలుపెట్టిన వెంటనే వరుసగా తుఫాన్‌లు, అల్పపీడనాలతో సముద్రంలోకి వెళ్లిన బోట్లు ఒకటీరెండు రోజులు కూడా వేట సాగించకుండానే తీరానికి చేరాల్సి వచ్చింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా మత్స్యకారులు నష్టాలు చవిచూశారు. దీనికితోడు గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఆ ఏడాది వేట నిషేధ సాయం అందించలేదు. దాంతో మత్స్యకారులు అప్పులపాలయ్యారు. నిషేధం అనంతరం రెండు నెలల పాటు సముద్రంలో అపారంగా మత్స్య సంపద దొరుకుతుందని మత్స్యకారులు నమ్ముతారు. ఈ ఏడాదైనా ప్రకృతి కరుణించాలని గంగపుత్రులు వేడుకుంటున్నారు. బంగాళాఖాతంలో మత్స్య సంతతి వృద్ధి చెందేందుకు వీలుగా ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి చేపల వేటపై నిషేధం అమలు చేశారు. మరబోట్లు, మెకనైజ్డ్ బోట్లు, మోటారు బోట్లతో సముద్రంలో చేపల వేటకు వెళ్లడంపై ప్రభుత్వం నిషేధం విధించింది. దాదాపు రెండు నెలల పాటు కొనసాగిన ఈ వేట నిషేధం ముగిసింది. మాంసాహార ప్రియులు లొట్టలేసుకుని తినే సముద్ర చేపలు, రొయ్యలు, పీతల రుచులను మళ్లీ ఆస్వాదించనున్నారు.



బోట్ల మోటార్లకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

2025–26 వేట నిషేధ భృతి ఇలా...

జిల్లాలో 50 కిలోమీటర్ల మేర సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఐదు మండలాల పరిధిలో 14,500 మత్స్యకార కుటుంబాలున్నాయి. జిల్లాలోని నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లో మొత్తం 35 వేలకు పైగా మత్స్యకార జనాభా ఉన్నారు. మత్స్యకార గ్రామాల్లో మొత్తం 7,285 మంది మత్స్యకారులు చేపల వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లేందుకు ఉపయోగించే మోటరైజ్డ్ బోట్లు 1,105 ఉన్నాయి. నాన్ మోటరైజ్డ్ బోట్లు 230 ఉన్నాయి. వాస్తవానికి 7,285 మంది సముద్రంలో వేట సాగించే మత్స్యకారులు ఉన్నట్లు టీడీపీ కూటమి ప్రభుత్వం గుర్తించింది. లేనిపోని సాకులు చూపి 1,784 మంది లబ్ధిదారులకు మత్స్యకార భృతి ఎగ్గొట్టి కేవలం 5,501 మందికి మాత్రమే రూ.20 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది.

గతేడాది వేట నిషేధ భృతికి ఎగనామం...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది వేట నిషేధ భృతికి ఎగనామం పెట్టింది. 2023–24లో వేట నిషేధ భృతి కింద తీరప్రాంతాల్లో 5,452 మంది మత్స్యకారులను అర్హులుగా ప్రతిపాదించారు. వేట నిషేధ భృతి కింద లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.10 వేల చొప్పున నేరుగా రూ.5.45 కోట్లు జమ చేశారు. 2024–25 వేట నిషేధ భృతి కింద 5,452 మంది మత్స్యకారులను గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాల్సిన రూ.5.45 కోట్లు జమచేయకుండా ఎగనామం పెట్టింది. గతేడాది ఎన్నికల కోడ్ రావడంతో భృతి అందలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చింది. అయితే, గతేడాది ఇవ్వాల్సిన బకాయిలకు మొండిచేయి చూపింది.

44 కేజీల గంజాయి పట్టివేత



దాడుల్లో పట్టుబడిన నిందితులు, గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరం నడిబొడ్డున భారీ మొత్తంలో గంజాయి పట్టుకోవడం కలకలం సృష్టించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన వడిసెల మోహన్‌రావు అనే పాత నేరస్తుడు నెత్తటి అప్పలరాజు అనే వ్యక్తితో కలిసి గంజాయి తరలిస్తుండగా ఒంగోలులోని అద్దంకి బస్టాండు సెంటర్లో ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. విశాఖపట్నంలో ఆనంద్ అనే వ్యక్తి దగ్గర కిలో రూ.4 వేల చొప్పున గంజాయి కొనుగోలు చేశారు. తమిళనాడులోని సేలంలో భూపతి, ఆండిస్వామిలకు కిలో రూ.7 వేల చొప్పున విక్రయించేలా ఒప్పందం చేసుకున్నారు. గంజాయిని చెన్నై తరలిస్తున్న క్రమంలో అద్దంకి బస్టాండులో ఉన్న ఇద్దరు నిందితులను ఎన్ఫోర్స్‌మెంట్ సీఐలు సోమిశెట్టి రామారావు, రావిపాటి నరహరి దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 44 కిలోల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఒంగోలు ఎక్సైజ్ పోలీసు స్టేషన్లో అప్పగించినట్లు సీఐలు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు షేక్ మౌలాలి, పి.రాజేంద్ర, హెచ్‌సీ వెంకటరావు, ఈసీలు శ్రీనివాసరావు, ఇంటూరి కొండలరావు, రామిరెడ్డి, బాల సుబ్బయ్య, హర్షవర్ధన్, నాగరాజు, జయ సూర్య పాల్గొన్నారు.

నేడు పాకల బీచ్‌లో యోగా

ఒంగోలు సబర్బన్: సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర–2025 మాసోత్సవాల్లో భాగంగా ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కక్షపూరిత రాజకీయాలు మానుకోండి

- కార్యకర్తలపై కాదు.. నాపై కేసు పెట్టి అరెస్టు చేసుకోండి
- అధికారం శాశ్వతం కాదు
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో ఏ ఒక్క పార్టీకి అధికారం శాశ్వతం కాదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులు కక్షపూరిత రాజకీయాలు మానుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపితే ప్రజలందరూ హర్షిస్తారని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. అమాయక ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలైన 30 నుంచి 40 మందిపై కేసులు పెట్టాలనుకోవడం కంటే నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నాపై కేసులు పెట్టి అరెస్టు చేసుకోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కాపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11వ తేదీ రైతుల కోసం పోరుబాటలో భాగంగా ప్రభుత్వం నుంచి అన్నీ అనుమతులు పొంది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నామని, అయితే వేలాదిగా తరలివచ్చిన రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేలా కూటమి నాయకులు ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ర్యాలీ జరుగుతుండగా కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు, మహిళలు నల్లబెలూన్లు చూపడం, రాళ్లు రువ్వడం తదితర చర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. అదే సమయంలో తమ పార్టీ కార్యకర్తలు తిరగబడి ఉంటే పరిస్థితి ఎంతవరకు వెళ్లేదో ఒకసారి కూటమి నాయకులు ఆలోచించుకోవాలని అన్నారు. నాయకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడాలని కార్యకర్తలకు సూచిస్తే ఇది సరైన పద్ధతి కాదని హితవుపలికారు. పోరుబాట కార్యక్రమాన్ని చెడగొట్టేందుకు కూటమి నాయకులు దుశ్చర్యలకు పాల్పడటం తగదన్నారు. ప్రశాంతంగా ఉంటున్న మార్కాపురం నియోజకవర్గాన్ని ఇబ్బందులకు గురిచేయవద్దని తెలిపారు. దాడిలో గాయపడిన వారి కుటుంబాల ఆవేదనను ఓదార్చగలమా అని ప్రశ్నించారు. పోలీసుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కూటమి నాయకులు శాంతియుత ర్యాలీ అంటూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం ఎంతవరకూ సమంజసమని అన్నారు. అధికారం అండగా ఎవరిపైనైనా కేసులు పెడతాం.. శిక్షిస్తామని.. అదే ధోరణితో ముందుకు వెళితే ఎల్లకాలం అధికారం ఒకరికే ఉండదనే విషయం గ్రహించాలన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ఏడాది పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని, సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని ధ్వజమెత్తారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో శనివారం నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడారు. సంపద సృష్టిస్తా, ప్రజలందరికీ సంపద పంచిపెడతానంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. కూటమి నేతల మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలపై అధిక ధరలు, పన్నుల భారం తప్ప మరేమీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

టీడీపీ నాయకులే అసంతృప్తి...

కూటమి పాలనపై టీడీపీ నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఈశ్వరయ్య తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని, పరీక్షల నిర్వహణ సకాలంలో చేయలేక ఏడాది సమయం తీసుకున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు సేవలు చేయడంలో మాత్రం ఎలాంటి ఆలస్యం చేయడం లేదన్నారు. గ్రామ సభలు నిర్వహించకుండానే గిరిజన ప్రాంతాల్లోని విలువైన భూములను అదానీకి అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఇది చట్టవిరుద్ధమని తెలిసినా స్వార్థంతో తెగబడుతున్నారని అన్నారు. కూటమి పాలనలో మహిళలపై వారానికి నాలుగు అత్యాచారాలు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. 5 వేల మంది ఉన్న ఊరిలో బెల్టుషాపులు పెట్టి కోటి రూపాయల వ్యాపారం చేస్తున్నారంటే రాష్ట్రంలో దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవచ్చని చెప్పారు.తల్లికి వందన పథకాన్ని స్కీం వర్కర్ల పిల్లలకు వర్తింపజేయాలని కోరారు. ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, వెయ్యి జాతాలు, కళా బృందాలు పాల్గొంటాయని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మహిళా నాయకురాలు ఎం.విజయ, పార్టీ నాయకులు అందె నాసరయ్య, సయ్యద్ మౌలాలీ, వి.హనుమారెడ్డి, కేవీ కృష్ణగౌడ్, ఆర్.రామకృష్ణ, ప్రభాకర్, ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వికాస కేంద్రం పేరుతో దోపిడీ

- ప్రైవేటు వ్యక్తి పేరుతో క్యూ ఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు
- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి తనిఖీల్లో బట్టబయలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన రాజరాజేశ్వరి



వై.పాలెంలోని ఇండోర్ స్టేడియం

స్టేడియంలో ప్రైవేటు వ్యక్తి పేరుతో ఉన్న క్యూ ఆర్ కోడ్

యర్రగొండపాలెం: క్రీడా వికాస కేంద్రాన్ని తమ పబ్బం గడుపుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. ఆ కేంద్రాభివృద్ధి పేరుతో డబ్బు దండుకోవటానికి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు సరికొత్తగా ప్లాన్ చేశారు. కేంద్రం నిర్వహణ కోసం ప్రతి నెలా సభ్యుల నుంచి వసూలు చేసే సభ్యతాలు ప్రభుత్వ అకౌంట్‌లో జమయ్యే విధంగా క్యూఆర్ కోడ్‌ను శాప్ శాఖ ఏర్పాటు చేసింది. కానీ, దాన్ని కాదని కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు క్రీడా వికాస కేంద్రంపై పెత్తనం చలాయించడంతోపాటు మంజూరైన నిధులు స్వాహా చేసేందుకు ఆ కేంద్రాన్ని తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. ఆ మేరకు ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ తొలగించి ఒక ప్రైవేటు వ్యక్తిపేరుతో క్యూఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ వివరాల్లోకెళ్తే...

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రం (ఇండోర్ స్టేడియం)లో 42 మంది సభ్యులున్నారు. గతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సభ్యులే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత కమిటీ స్థానంలో కొత్త కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, కో కన్వీనర్‌గా ఎంఈవో–2 మల్లూ నాయక్, ఇతర శాఖలకు చెందిన కొంతమంది అధికారులు సభ్యులుగా కొనసాగుతున్నారు. కేంద్రంలో ఉన్న రెండు షటిల్ కోర్టులలో విద్యుత్ సౌకర్యం కొరవడింది. అందుకుగానూ ఎంపీడీవో రూ.78 వేలు ఖర్చుపెట్టినట్లు తెలిసింది. ఈ స్టేడియం పూర్తి నిర్వహణను కో కన్వీనర్ చేతుల్లోకి తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంతోనే కమిటీ సభ్యులలో ఒకరైన స్థానిక ఒక సెల్‌పాయింట్ యజమాని పేరుతో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారిణి జి.రాజరాజేశ్వరి ఈ నెల 8వ తేదీ స్టేడియంను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్రైవేటు వ్యక్తి పేరుతో క్యూఆర్ కోడ్ స్కానర్ ఉండటం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం లాంటివి ఆమె గుర్తించారు. అంతేగాకుండా క్రీడా వికాస కేంద్రాన్ని తామే నిర్వహించుకుంటామని అధికారిణిపై ఒకరు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టేడియం నిర్వహణ తామే చేసుకోవాల్సి ఉందని, ఆ నిబంధనలను వ్యతిరేకిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆ అధికారిణి కలెక్టర్ తమీమ్ అన్సారియా, శాప్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

> **ఫిర్యాదు చేసింది వాస్తవమే :**
>
> వై.పాలెంలో ఉన్న క్రీడా వికాస కేంద్రాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్టేడియంలో ప్రైవేటు వ్యక్తి పేరుతో క్యూఆర్ కోడ్ స్కానర్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సరికాదు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాను. స్టేడియంలో ఎలక్ట్రికల్ పనులకు అన్ని పన్నులతో కలుపుకుని రూ.6.25 లక్షలను శాప్ ఇంజినీరింగ్ శాఖ మంజూరు చేసింది. ఈ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే స్టేడియం నిర్వహణ జరగాలి. లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుంది.
>
> రాజరాజేశ్వరి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి

15 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసు

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు బోర్డు సందర్శన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన చేస్తున్న మహిళలపై చెప్పులు, వాటర్ బాటిళ్లు, రాళ్లతో దాడి చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలపై శనివారం కేసులు నమోదు చేశారు. ముల్లా ఖుద్దూస్ ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 51-25 యూ–ఎస్ 189(2),191(2), 132, 121(1), 109(1) ఆర్–డబ్ల్యూ 190 బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో ముండ్లమూరు మండలం కొమ్మవరానికి చెందిన మేకల కృష్టారెడ్డి, దర్శి మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన నలమోలు మోహన్, చీమకుర్తికి చెందిన మన్నం శ్రీధర్‌బాబు, అర్ధవీడు మండలం మాగులూరుకు చెందిన నారి వెంకట కొండయ్య, కోడె గంగులయ్య, కొనకనమిట్ల మండలం వాగుమడుగుకు చెందిన బొరిగొర్ల గోపి, పెద్దారవీడు మండలం సుంకేసులకు చెందిన గుర్రం బాలకృష్ణ ఉన్నారు. పొగాకు బోర్డు సెక్యూరిటీ గార్డు రవికుమార్ ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 52-25 యు–ఎస్ 189(2)191(2), 132, 121(1), 109(1), 331(5), ఆర్–డబ్ల్యూ 190 బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం మరో 8 మందిపై కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో చీమకుర్తి మండలం గోనేపల్లివారిపాలేనికి చెందిన కోనేటి వెంకటశివ, కోనేటి రాజశేఖర్, పొదిలి ఇస్లాంపేటకు చెందిన షేక్ బాజీ, షేక్ సుబానీ, పొదిలి నవాబ్‌మిట్టకు చెందిన షేక్ మజూన్, పొదిలి ప్రకాశ్‌నగర్ కు చెందిన బల్లి పీటర్ పాల్, పొదిలి బ్యాంక్ కాలనీకి చెందిన రావూరి వెంకట సాయి పవన్, పొదిలి మండలం సల్లూరుకు చెందిన పూని వెంకటేశ్వర్లు ఉన్నారు. వీరిలో ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. మరో తొమ్మిది మందిని స్థానిక కోర్టులో హాజరుపరిచారు.